సూరీడు అలగకుండా తూర్పు కనుమల నుండి ఉదయించడానికి ఉవ్విళ్ళూరుతున్నాడు.

చీకటి, అయ్యో కొద్దిసేపట్లో వెళ్లిపోతానుకదా, అని బాధపడ్తుంది.

పక్షులు, తిరిగి తమ స్వేచ్ఛను హరించే నరుల బారిన పడ్తాం కదా అని అరుస్తున్నాయి.

అప్పుడే...

శరత్ ఇంటిముందు కారు ఆగిన చప్పుడు.

# తేడా

## - జోషి శ్రీనివాసరావ్

ఒక్కటే హారన్ మోత.

పెందలాడే లేచే శరత్ అమ్మ బయటకు రాగానే కారులోంచే-

''శరత్ ఉన్నాడా? కొద్దిసేపట్లో మినిస్టర్‌గారు వస్తున్నారు. కళ్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన, ప్రోగ్రాం రాత్రే ఫిక్స్ అయింది. మాకిప్పుడే యంఎల్‌వి చెప్పారు. విలేకరులందరికీ చెప్పాలంటే సమయంలేదు. శరత్ దగ్గరలోనే ఉన్నాడుకదా, తీసుకువెళ్లడానికి వచ్చాం. కొద్దిగా లేపండి.''

శరత్ ఒక దినపత్రిక విలేకరి. అందుకే యంఎల్‌వి పంపిస్తే వాళ్లొచ్చారు.

విషయం తెలుసుకున్న శరత్ అమ్మ లోనికెళ్లి...

''ఒరేయ్ శరత్! లేవరా. ఎవరో వచ్చారు. మినిస్టర్ వస్తున్నారట. నిన్ను రమ్మంటున్నారు. లేవరా మొద్దు నిదుర. లేవరా'' దుప్పటి లాగేసరికి నిద్ర నుండి లేచిన శరత్.

''ఊ... ఎవరమ్మా ప్రొద్దునే...?'' అంటూ బయటకు రాగానే-

''హలో శరత్! త్వరగా రా. మినిస్టర్ వచ్చే టైమయింది. మళ్లీ తయారవవచ్చు. పదరా'' అంటూ గుంజి కారులో లాక్కెళ్లి ఎత్తుకుపోయే మాదిరి వారి హడావుడి.

విషయం తెలుసుకొన్న శరత్ ''తప్పదు సుమతి'' అని అలాగే ఏదో మొహం కడుక్కుని బట్టలు మార్చుకుని వారితో బయలుదేరాడు.

సమయం పొద్దున ఆరుగంటలవుతుంది.

ఊరినుండి బయట పొలాల్లో ఓ దాత ఇచ్చిన స్థలంలో కళ్యాణమండపం నిర్మాణానికి శంకుస్థాపన. ఊరు నుండి సుమారు ఐదు కిలోమీటర్లుంటుంది ఆ స్థలం.

తన నియోజకవర్గంలోని, ఆపై తన ఊరిగుండా వేరే తోటకు ప్రోగ్రాంకి మంత్రివర్యులు బయలుదేరి వెళ్తున్నారని, మంత్రిచే తన ఊరిలో ఏదైన ప్రోగ్రాం పెట్టించాలని యంఎల్‌వి హడావుడి చేసి ప్రాధేయపడి ఈ కార్యక్రమాన్ని ఫిక్స్ చేసాడు.

రాత్రికి రాత్రే అందుబాటులో వున్న కార్యకర్తలకు, చోటా మోటా నాయకులకు తెలియజేసి ప్రొద్దునే మంత్రి రాక కోసం ఎదురుకాస్తూ మంత్రి పాల్గొన్న విషయం పేపరులో పడడానికి ఒక విలేకరి కావాలికదా అని శరత్ ఇంటికి తన వ్యక్తులను పంపి అతన్ని తీసుకెళ్లడం జరిగింది.

మంత్రివర్యులు విచ్చేసారు.



సకల మర్యాదలతో యంఎల్‌వి అండ్ హిజ్ ఫాలోవర్స్ మంత్రిని ఎదుర్కొని శంకుస్థాపన చేయించారు. అమాత్యులు నాలుగు ముచ్చట్లు చెప్పి కారెక్కాడు. అతని వెంటే ఫాలో అంటూ యంఎల్‌వి, మిగతా మంది మార్బలం అచ్చట నుండి పలాయనం.

ఆ ప్రాంతంలో...

విషయమేమిటో అర్థం కాకున్నా పొలం పనికై వచ్చిన రైతాంగం మంత్రి ప్రోగ్రాంకి అవసరమయ్యే షామియానా, మైకుసెట్లు, మనుషులు, వార్తా సేకరణకై వచ్చిన విలేకరి శరత్.

ఏదో గొణుక్కుంటూ రైతులు వెళ్లిపోయారు. షామియానా, మైకుసెట్టు విప్పుకుంటూ సంబంధిత వ్యక్తులు.

మంత్రి రాకమునుపు విలేకరి అవసరమని ప్రొద్దునే హడావుడిగా ఇంటి నుండి కారులో తీసుకెళ్లి కార్యక్రమం అనంతరం...ఇక విలేకరితో మాకేం పని అన్నట్లు అందరూ మంత్రి వెనక్కే వెళ్లిపోవడం, ప్రొద్దున కారులో తీసుకువచ్చాం కదా! మళ్లీ దిగబెడదాం అనే జ్ఞానంలేని ఆ వ్యక్తులు సైతం పలాయనం.

ఒంటరిగా ఇంటికి నడుచుకుంటూ వస్తూ పాపం విలేకరి...

ఔరా...!

**అమాత్యులు నాలుగు ముచ్చట్లు చెప్పి కారెక్కాడు. అతని వెంటే ఫాలో అంటూ యంఎల్ఏ, మిగతా మంది మార్బలం అచ్చట నుండి పలాయనం.**

కామాంధకారంలో ఓ పలుకుబడిగల వ్యక్తి, వ్యభిచరించాలనే కాంక్షతో ఎవరు చూస్తున్నారు, చూడడం లేదు అనే ఆలోచన లేక- నడిరోడ్డుపై నుండి పిడికెడు మెతుకులు కోసం అయిష్టమైన ఆ వృత్తికి అంకితమైన పడుచును తన మోపెడ్‌పై ఎక్కించుకుని జనసంచారం లేని చోటికి తీసుకెళ్లి అనుభవించి నాలుగు రంగు కాగితాలు ఆమె చేతిలో కుక్కి పని అయిందికదా అని ఆత్రుతతో ఎవరన్నా తనను చూస్తారన్న భయంతో పాపం ఆ స్త్రీని అక్కడే వదిలి పారిపోయే కామంధుని మాదిరి...

విలేకరి అవసరమని ప్రొద్దునే రావడం, ఉన్నఫళంగా తనను కారులో తీసుకెళ్లడం పని అయిపోగానే అక్కడే వదిలిపెట్టి వెళ్లిపోవడం...

ఆ ఇంటికి నాకు ఏం తేడా? అని ఆలోచిస్తూ నడుచుకుంటూ ఇంటికి చేరుకున్నాడు విలేకరి శరత్. ★